పంట మార్పిడి.. ప్రయోజనకరం

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 7704 మంది రైతులు 15723 ఎకరాల పంటను సాగు చేస్తున్నారు. అయితే ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో భూములు నిస్సారంగా మారి వ్యవసాయంలో ఆశించినంతగా ఫలితాలు ఉండడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంట మార్పిడి వలన పంటల దిగుబడి పెరగడమే కాకుండా భూమి కూడా సారవంతమవుతుందని చెబుతున్నారు. –నగరి


టీపీ కండ్రిగ వద్ద పంట సాగులో నిమగ్నమైన రైతు


నాటేందుకు సిద్ధంగా వరిమడి

- భూసారం పెరిగి అధిక దిగుబడులు
- రసాయనాల ఖర్చుల భారం తగ్గుదల
- తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షణ

ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. ఇలా చేయడంతో పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. అలాగే నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. అలాగే భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

భూమికి మేలు చేసే పంటలు

పంటల మార్పిడిలో భాగంగా కందులు, మినుములు, సజ్జ, పెసలు, ఉలవలు వంటి వివిధ రకాల పంటలు సాగు చేయడంతో వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటాయి. కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. ఈ పంటల వేరు మొదళ్లు నత్రజనిని స్థిరీకరిస్తాయి. ఈ పంటలు సాగు చేయడంతో చాలా వరకు రాలిన ఆకుల రూపంలో సేంద్రీయ ఎరువు లభిస్తుంది.

తెగుళ్లు, చీడపీడల నివారణ

ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు పంటను ఆశించి వృద్ధి చెందుతాయి. దీని వలన పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటను కాకుండా మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు తదితర పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుములు, వేరుశనగ తదితర పంటలను లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, రాగులు తదితర ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. వరి వేసే పొలానికి ముందుగా జనుములు వేస్తే సేంద్రీయ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. మొత్తంగా రైతులు పంట మార్పిడి వ్యవసాయం చేయడంతో లాభదాయకంగా ఉంటుంది.

పంట మార్పిడితో అధిక దిగుబడి



పంటల మార్పిడితో దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగు చేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. దీని వలన రసాయన ఎరువుల ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులు, మినుములు, సజ్జ తదితర వంటలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ పంటలు సాగుచేసుకోవచ్చు.

–రాఘవేంద్రయాదవ్, ఏఓ, నగరి మండలం

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

నింద్ర: మండలంలోని నింద్ర క్రాస్ రోడ్డు వద్ద వున్న శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు చెన్నైకు చెందిన భక్తులు తిరుమలకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో ఉన్న నింద్ర క్రాస్ వద్ద శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్గానిక్ మేళాకు పెనుమూరు రైతు


హరికృష్ణారెడ్డి

కార్వేటినగరం (పెనుమూరు): ప్రముఖ ప్రకృతి రైతు పసపల హరికృష్ణారెడ్డికి న్యూఢిల్లీ భారత మండపంలో నిర్వహించే అంతర్జాతీయ ఆర్గానిక్ మేళాలో పాల్గొనేందుకు ఆహ్వానం లభించిందని ఆదివారం ఆయన తెలిపారు. హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ న్యూఢిల్లీలో ఈ నెల 25 నుండి 28 వరకు నిర్వహించే ప్రపంచ ప్రకృతి పంటల మేళాకు హాజరు కానున్నట్టు తెలిపారు. ఇటీవల పులిగుంటీశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని నెలకొల్పి, 600 మంది రైతులను సభ్యులుగా చేర్చి ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రకృతి పంటల మేళాకు ఆహ్వానం రావడం గర్వకారణమని తెలిపారు.

వేదగిరివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని వేదగిరివారిపల్లెలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తామన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

ఐరాల: తన కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

అలరించిన దుర్యోధన వధ



రామచంద్రాపురం: మండలంలోని నూతికుంటపల్లెలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధనవధ ఘట్టంతో ముగిశాయి. దుర్యోధన, భీమసేన వేషధారులు రోషావేశాలతో కలియబడుతూ తమ ప్రదర్శనతో రక్తి కట్టించారు. వధ ఘట్టం ముగిసిన అనంతరం భక్తులు దుర్యోధన ప్రతిమ మట్టి కోసం ఎగబడ్డారు.రాత్రి భక్తులు ఉపవాస దీక్షలతో అగ్ని గుండం ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు.అనుపల్లె, కొత్త వేపకుప్పం, గంగుడుపల్లె గ్రామ ప్రజల సహకారంతో ఉత్సవాలు విజయవంతం చేసినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు.

27న ఎస్బీఆర్‌పురం చెరువు వేలం

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట మండల పరిధిలోని ఎస్బీఆర్‌పురం(గూళూరు) చెరువు చేపల వేలం పాటను ఈనెల 27వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామ ఫార్మర్స్ సొసైటీ వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల పెంపకం కోసం నిర్వహిస్తున్న బహిరంగ వేలంలో పాల్గొనేందుకు రూ.15 వేలు కట్టి రసీదు పొందిన వారు అర్హులని తెలిపారు.

విస్తారంగా జనుము సాగు


అగరంలో జనుము సాగు

నింద్ర: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు జనుము సాగు చేస్తున్నారు. రైతులు రబీ సీజన్‌లో వరి, వేరుశనగ పంటలు సాగు చేయడానికి పొలంలో పచ్చిరొట్టగా జనుము సాగు చేసినట్లు రైతులు తెలిపారు. రబీ సీజన్‌లో వరి, వేరుశనగ పంటలు సాగు చేసే పొలంలో జనుము సాగు చేసి, కలియ దున్నడంతో పొలంలో సారవంతంగా తయారవుతుంది. దీంతో పొలంలో చేసిన పంటలకు సరిపడా పోషకాలు అందుతాయి. మండలంలో మొత్తం 800 ఎకరాలు వరకు జనుము సాగు చేసినట్లు రైతులు తెలిపారు.

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాలు


విద్యుత్ దీపాలంకరణలో ద్రౌపదీదేవి ఆలయం


ఆరేటమ్మ ఆలయం


విశేష అలంకరణలో ఆరేటమ్మ


బొమ్మల కొలువు

- బొమ్మల కొలువుకు వేళాయె..
- శోభాయమానంగా ముస్తాబైన ఆలయాలు

పుత్తూరు: పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాలు దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవార్లు రోజుకో ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతి రోజూ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు, ఊరేగింపులు నిర్వహించనున్నారు. గ్రామ దేవతగా పూజలందుకొంటున్న ఆరేటమ్మ ఆలయంలో మాత్రం మంగళవారం నుంచి ప్రత్యేక అలంకరణల్లో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారు చాముండేశ్వరీ అలంకరణలో దర్శనమివ్వనున్నారు. మంగళవారం అష్టభుజ దుర్గ, బుధవారం అన్నపూర్ణ, గురువారం లక్ష్మీ, శుక్రవారం దేవి కరుమారి, శనివారం వారాహి, ఆదివారం కామాక్షి, సోమవారం కామాక్షి శివపూజ, మంగళవారం సరస్వతి, బుధవారం రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. నవరాత్రి వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ఆయా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని అన్ని అమ్మవారి ఆలయాలు విద్యుత్ దీపకాంతులతో శోభాయమానంగా వెలుగొందుతున్నాయి.

వారాహి ఆలయంలో చండీ యాగం

పరమేశ్వరమంగళం గ్రామ సమీపంలో వెలసి ఉండు శ్రీదక్షిణ కాళీ వారాహీ శక్తి పీఠంలో నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 2వ తేదీ గురువారం నవరాత్రుల ముగింపు సందర్భంగా చండీ యాగం, బాల కన్య పూజ, సుమంగళి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర్లు తెలిపారు. చండీ యాగంలో పాల్గొనేవారు వెయ్యి రూపాయలు చెల్లించి రసీదు పొందాలని తెలిపారు.

నేడు దివ్యాంగులకు వైద్య నిర్ధారణ శిబిరం

గంగాధరనెల్లూరు: దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన వైద్య పరికరాలు అందజేసేందుకు వైద్య నిర్ధారణ శిబిరాన్ని సోమవారం ఉదయం 9.30 గంటలకు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలింకో వైద్యుల సహకారంతో సమగ్ర శిక్ష శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందజేయనున్నట్టు తెలిపారు. గంగాధరనెల్లూరు, వెదురుకుప్పం, కార్వేటినగరం, పెనుమూరు పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల పరిధిలోని 18 సంవత్సరాల వయసులోపు ఉన్న దివ్యాంగ విద్యార్థులు శిబిరానికి హాజరు కావచ్చునన్నారు. వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, సీపీ చైర్స్, చంక కర్రలు అందిస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చే దివ్యాంగ విద్యార్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్,, యూడీఐడీకార్డు జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని తెలిపారు.

కలసికట్టుగా అభివృద్ధి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల


పాలసముద్రం: మండలంలోని అన్ని పంచాయతీలు అభివృద్ధి చెందడానికి అధికారులు ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పని చేయాలని ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అస్ప్లగస్ తెలిపారు. ఆదివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సతీష్ సమక్షంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శ్యామల మాట్లాడుతూ ప్రసుత్తం సీజన్‌లో దోమలు వృద్ధి చెందిన విషజ్వరం వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మండలంలో చేస్తున్న అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల పనులు నాణ్యంగా చేయాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలు ఉన్నాయని ఫిర్యాదులు వస్తుంది. గ్రామాల్లో తాగునీటి సమ స్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శిపై ఉందని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు అస్ప్లగస్ మాట్లాడుతూ జెడ్పీటీసీ నిధుల్లో రూ.5 లక్షలను ఇందిరానగర్ గ్రామానికి తాగునీటి కోసం కొత్తబోరు వేసి మోటారు అమర్చి తాగునీటి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి. ఏఓ ఢిల్లీప్రసాద్. ఉపాధి హామీ ఏపీఓ మార్గరెట్, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, సర్పంచులు గాలి మహేష్ బాబు, అనురేఖ, శోభ, భాస్కర్‌రెడ్డి. జీవిత, లిల్లీ, వైస్ ఎంపీపీ పుష్ప, ఎంపీటీసీ గోవిందరాజ్, లిఖిత, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంట కార్మికులకు జీతాలు పెంచాలి


మాట్లాడుతున్న కోదండయ్య, నాయకులు

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న వంట కార్మికులను వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో మధ్యాహ్న భోజన కార్మికులతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా విద్యార్థులకు ఇచ్చే మెస్ బిల్లులను పెంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసే కార్మికులకు రోజుకు రూ.100 చెల్లిస్తే కుటుంబాలను ఎలా పోషించుకోగలరని ప్రశ్నించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో జీతాలు పెంచినప్పటికీ ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని చెబుతున్నారు కానీ ఇప్పటి వరకు కార్మికులకు ఉద్యోగ భద్రత కానీ, వేతనాలు పెంచడంలో కానీ, గుర్తింపు కార్డులు ఇవ్వడంలో కానీ, కనీసం గ్రాట్యుటీ ఇవ్వక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మధ్యాహ్నం భోజన కార్మికులకు వేతనాలు పెంచి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటానికి సంసిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఆయమ్మల జిల్లా కార్యదర్శి జయకుమారి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రమేష్, బోజన పథకం మండల నాయకులు రేష్మ, భారతి, యశోద, అనూష, మహేశ్వరి, విజయశాంతి, గుండమ్మ, కమలమ్మ, దేవకి పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు


ముత్యాలమ్మ

బంగారుపాళెం: స్థానిక గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో సోమవారం నుంచి దసరా, దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను 22వ తేదీ నుంచి 11 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రోజూ అమ్మవారు ఒక్కో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని, తొలిరోజు సోమవారం చదనాలంకారం, 23న బాల త్రిపుర సుందరి, 24న గాయత్రిదేవి, 25న లలితా త్రిపుర సుందరి, 26న అన్నపూర్ణదేవి, 27న మహాదేవి, 28న సరస్వతీదేవి, 29న దుర్గాదేవి , 30న మహిషాసుర మర్ధిని, అక్టోబర్ 1న రాజరాజేశ్వరిదేవి, 2న పుష్పాలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని వివరించారు. అలాగే, స్థానిక ఓంశక్తి ఆలయంలోనూ సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలియజేశారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం


హరికథాగానం చేస్తున్న భాగవతారిణి శారద

తవణంపల్లె: స్థానిక ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ఆదివారం ధ్వజారోహణంతో మహాభారత యజ్ఞం ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త గుడిసె మునస్వామి శెట్టి, కార్య నిర్వాహకులు ఆధ్వర్యంలో అర్చకులు ద్రౌపదీదేవి పాండవుల విగ్రహాలకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు మదనపల్లెకు చెందిన భాగవతారిణి ఎ.శారద హరికథాగానం చేస్తారని తెలిపారు. 29 సోమవారం మధ్యాహ్నం బకాసుర బలిబండి, అదే రోజు నుంచి అక్టోబర్ నెల 12వ తేదీ రాత్రి వరకు వినాయక నాటక మండలి కళాకారులు తమిళంలో రాత్రి నాటక ప్రదర్శనలు ఉంటాయని ధర్మకర్త మునస్వామి శెట్టి తెలిపారు.

మొగిలిలో అన్నదానం



బంగారుపాళెం: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని మొగిలి శివాలయంలో కరణం సంక్షేమ సంఘం సభ్యులు అన్నదానం చేశారు. తొలుత స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రాణాంతకం.. గాలికుంటు


పాడి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

పాలసముద్రం: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి చాలా ప్రమాదకరమైందని, దీనిని నిర్లక్ష్యం చేస్తే పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందంటుందని మండల పశువైద్యాధికారి పార్థిబన్ తెలిపారు. గురువారం స్థానిక పశు వైద్యశాలలో ఆయన మాట్లాడారు. సాధారణంగా వర్షం వచ్చి పచ్చి గడ్డి మేస్తే పశువులు, ఆవులు, గేదెలకు ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకితే దేశవాళీ పశువుల్లో ప్రాణనష్టం ఉండకపోవచ్చు. సంకర జాతి పశువులకు మాత్రం ప్రాణ నష్టం తప్పదు. ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్ మాసాల్లోనే ఎక్కువగా గాలికుంటు వ్యాధి వస్తుంది. వ్యాధి, నివారణ, చికిత్స మార్గాలను పశువైద్యాధికారి పార్థిబన్ సూచించారు.

నివారణ

- క్రమం తప్పకుండా ముందుగానే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలి
- ప్రతి ఆరు నెలలకో సారి పశు వైద్యశాలలో ఉచితంగా వేసే గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలి.
- వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచాలి. పశువుల పాకలను క్రిమి సంహారక మందులు, వాషింగ్ సోడాతో ఎప్పటికప్పుడు శుభ్రపపరచాలి.
- వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదు. వాటిని గడ్డి వేసి కాల్చివేయాలి. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలను దూడలకు తాగించ డూడదు. వాటిని గ్రామాల్లో అందరూ కలసి చెరువు, అడవులకు తోలుకుపోతున్న పశువులున్న ప్రదేశాలకు తీసుకెళ్లొద్దు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు మృతి చెందితే గుంత తీసి పూడ్చివేయాలి. ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబర్, డిసెంబర్ మాసాల్లో పశువులను శుభ్రంగా కడిగి వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలి.

వ్యాధి లక్షణాలు

- సూక్ష్మాతి సూక్ష్మ జీవుల(వైరస్)తో పశువులకు ఈ వ్యాధి సోకుతుంది. ఇది ఒక దాని నుంచి మరో పశువుకు సోకుతుంది.
- వ్యాధి సోకిన ఆవులు, గేదెలు పాల ద్వారా వాటి దూడలకు కూడా అంటుతుంది. చిన్న దూడలు తొందరగా మృతి చెందే అవకాశం ఉంది.
- పశువుల నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడుతాయి. 3 నుంచి 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండుగా మారి చర్మం గురుకుగా మారుతుంది.
- నోటిలో చిగుళ్లపై పొక్కులు ఏర్పడడంతో పశువులు మేత మేయవు. పూర్తిగా నీరసించిపోతాయి. పడుకున్న దగ్గర నుంచి లేవలేవు. నోటి నుంచి చొంగ కారుతుంది.
- పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలు తాగితే దూడలు మరణిస్తాయి. జ్వరం తీవ్రత 104 డిగ్రీలు నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. శరీరం వణుకుతుంది.

చికిత్స విధానం

- గాలికుంటు సోకిన పశువుల కాలి గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా నెమ్‌టెంట్, వేపనూనె పూయాలి.
- నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిజరిన్ కలిపి పూయాలి.
- వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండి ఎంతకూ తగ్గకుండా ఉంటే తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించాలి.


చెరువుల్లో పచ్చి గడ్డి మేస్తున్న పశువులు

ఆధునిక సమాజపు అడుగుజాడ గురజాడ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు 163 వ జయంతి ఘనంగా నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు హెచ్ .అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ కేవలం 53 సంవత్సరాల మాత్రమే జీవించిన గురజాడ ఆనాటి దురాచారాలను ఖండిస్తూ సమాజానికి సైతం స్ఫూర్తినిచ్చి ఆధునిక సమాజానికి అడుగుజాడగా గురజాడ నిలిచారన్నారు .జిల్లా ప్రధాన కార్యదర్శి యుగంధర్ బాబు మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక యువతకు మ్యాజిక్‌పై శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థులతో గ్రామీణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలను రూపుమాపేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా పర్యావరణ విభాగం కన్వీనర్ జి .సుధాకర్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో ప్లాస్టిక్ వస్తువులను రీసైక్లింగ్ చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు .జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షురాలు జయంతి, రాష్ట్ర జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు వైయస్. నాగేశ్వర్ మాట్లాడారు. బాల చైతన్య, రంగనాథం, త్యాగరాజు నాయుడు, సాంబయ్య, రామచంద్ర, వేణుగోపాల్, త్యాగరాజు నాయుడు, విజయ్ కుమార్, సుదర్శనాచారి, ఆనంద్ బెస్ పాల్గొన్నారు.